# దీపావళి

అడవి బాపిరాజు

౧

కటికిచీకటిలో దీపాలు. నల్లటి ఆకాశంలో నక్షత్రాలు. కారుచక్కదనం నవ్వితే ముత్యాల పలువరుసలు. అరుగులమీద దీపాలు, వాకిలిముందర మొగబొప్పాసి చెట్లమీద అమరించిన దీపాలు, ఇంటిముందర కర్రలుకట్టిన అంతస్తుల దీపాలు. ఆకాశ దీపాలు. ఇళ్లల్లో దీపాలు. గుళ్లల్లో దీపాలు. బిడ్డల చేతుల్లో బాణసంచాదీపాలు. రంగు రంగుల మతాబాలు, విదేశీ బాణాసంచులు స్వదేశీ బాణాసంచులు. టపాకాయల ఫిరంగిమోతలు. చిచ్చుబుడ్లు, తూటాలు, తారాజువ్వలు, దీపాలపండగ, వెలుగువర్షము. అందరికీ సంతోషము. నోట్లో వేలు పెట్టుకొని, ఆదీపాలవెలుగుల్లో మెరిసే కళ్లతో నిలుచున్న ఆవుప్పురి అబ్బాయికిమాత్రం దీపావళి లేదు.

౨

పొద్దున్నుంచీ బాణసంచాలకొట్లదగ్గర చింపిరిజుట్టుతో అల్యూమినియం మురుగులతో, సీలీ జేగురూ కలిపిన వంటిరంగు వెలుగుతో ఆవుప్పురిఅబ్బాయి నిలిచి విస్తుబోతూ చూస్తూనేఉన్నాడు. అందరికీ బాణాసంచాలు, అతనికిమాత్రం లేవు.

సాయంత్రందాకా నుంచుంటేమాత్రం, ఒక్కతాటాకు టపాకాయిగాని, సిసింద్రీగాని, మతాబా అగ్గిపుల్లగాని ఆకుర్రవాడి చేతిలో పెట్టే దయతో నిండిపోయిన హృదయంకలవాడు ఒకడూ కనుపించలేదు. పొద్దున్నించీ లక్షలకొద్దీ టపాకాయ లమ్మిన సాహెబు, "సాలా బాగా పేలుతాయీ అండీ! జర్మనీవాడి ఫిరంగిలాగా వుండాలీ! మీకీ అయిదువందల్ ఏసుకోండి" అని విచిత్రంగా అమ్మగలిగాడుకాని కొనేవాళ్లకి చూపించడానికి కాలిస్తే, పేలకుండా తుస్సుమన్న టపాకాయినికూడా ఆకుర్రవాణ్ణి ఏరుకోనిచ్చాడుకాడు.

పొద్దున్నుంచీ ఇంటి కెళ్లి తిండయినా తినలేదు ఆవుప్పురివాడు. వాళ్లఅమ్మా, నాన్నా 'ఎర్రోడు ఎక్కడికి పోయాడో, గంజినీల్ల కయినా వచ్చాడుకాడు' అని అనుకున్నారు గాని, ఆకుర్రవాడికోసం వెదుక్కుంటూ వచ్చినవాళ్లు లేనేలేరు.

ఆసాయంత్రంనుంచీ బందరు వీధులన్నీ తిరిగి, ఆకుంకాయి బచ్చుపేటలో బాగా బాణాసంచాలు కాల్చే ఒకమేడముందర నిలబడ్డాడు. ఆఇంటిలో పెద్దలు ఆడపిల్లలచేత మొగపిల్లవాళ్లచేత కాల్పించిన బాణసంచా విదేశీవి, స్వదేశీవి నలభయి రూపాయీల దాకా ఉంటుంది.—పిల్లల కిలకిలలు, పెద్దల నవ్వులు. గుమ్మందగ్గర పళ్లులేని ముసలమ్మ బోసిహాసం. ఆయింటిముందర బాణసంచా కాల్పులు చూడడానికి చేరిన తక్కినబీద వాళ్ల పిల్లలు, వెకిలిగా 'ఇవి యివ్వండీ, అవి యివ్వండీ' అని అడిగి పుచ్చుకొని కాల్చుకొంటున్నారు. భయంచేత పారేసిన సగం కాలు

తూవున్న మతాబులు పుచ్చుకొని కాల్చారు: వీడుమాత్రం చూస్తూనే నిలుచున్నాడు కాని ఒక్క అడుగయినా కదిలాడు కాడు.

వాడివళ్లు ఉక్కుకడ్డీలాగా గట్టిగా వుంది. మెరుగుపెట్టిన ఎర్రరాయిలా నున్నగా తళతళలాడుతోంది. కనుముక్కుతీరూ కలిగి ఉన్న మొఖంమీద కాంతులు అభినయం చేస్తున్నవి. మతాబులవెలు గాజుట్టుమీద పడినపుడెల్ల, మబ్బుపింజెలమీద పడిన సూర్యుడి వెలుగులా ఆడిపోయింది. వాడికి పొద్దటినుండీ కడుపులో కూడు లేదు.

## 3

సాయంత్రం వాడు ఇంటిదగ్గర నిలుచున్నదగ్గరనుంచీ, ఆ యింటివారి వెధవాడపడుచు ఆ అబ్బాయివైపు తదేకదృష్టితో చూస్తూనేవుంది. ఆవిడకి ఇరవైయ్యేయిదేండ్లు. చిన్నతనంలో సౌందర్యం మూటలు కట్టుకొన్న మురిపాలపడుచయినా, సాంగత్యమెరగని భర్తవియోగం సంభవించి, ప్రేమకోసం కుమిలిపోయిన సన్యాసినీరూపం. వైధవ్యంలోనయినా అలంకరించుకొని అందంగా కనపడేవాళ్లలాంటిదిమాత్రం కాదు. తన జీవితంయొక్క పరమావధి ఏమిటాఅని పుస్తకాలు వెతుక్కొన్న అభాగ్యురాలు. భజనలకు వెళ్లినా, గుళ్లల్లో హరికథలకు వెళ్లినా, పండితుల ఉపన్యాసాలకు వెళ్లినా, సన్యాసుల జ్ఞానబోధకు వెళ్లినా, విధవ అయిన పురుషోత్తమ్మ, అస్పష్టంగా తోచే జీవితసత్యాన్ని కనుగొనడానికే బయలుదేరేది. ఆమెకు ఎప్పుడూ గుండె దడదడా కొట్టింపచేసేదీ, అందమయిన ఆమెకళ్లను ఎప్పుడూ మబ్బుల్ని చేసేదీ, తనచుట్టాలలో చూస్తూవున్న స్త్రీలమాతృత్వం. మంగళసూత్రంలేని ఆడదీ, మాతృత్వంలేని ఆడదీ, భూమిమీద మనకూడదని సాయంకాలపు వెలుగుల్లో కలిసిపోతూ ఎవరూ చూడకుండా చీరకొంగు కళ్ల కద్దుకొనేది. చుట్టాలపిల్లలు — బెల్లించి కొందరూ, భయపెట్టి కొందరూ — ఆమె పెట్టెలో ఎప్పుడూ నిలవుండే పిప్పరమెంటు దినుసులూ, మిఠాయి దినుసులూ, డబ్బులూ లాగేస్తూండేవారు. ఎవరిపిల్ల లేడ్చినా పురుషోత్తమ్మగుండె బద్దలయిపొయ్యేది. చుట్టాలపిల్లలికి పడిశంభారకింపు చేసినా, తుమ్ములు తగ్గేదాకా, ముక్కువెంబడి పడిశం ప్రవహించడం మానేదాకా వాళ్లని వదిలేది కాదు. పిల్లలకి ఎవరికయినా పెద్దజ్వరాలు వచ్చాయంటే పెట్టెలో దాచుకొన్న వెన్నముద్ద గోపాలవిగ్రహానికీ, కాశీ అన్నపూర్ణ విగ్రహానికీ పెట్టని దణ్ణాలు లేవు; వేల్పులకు మొక్కని మొక్కులూ లేవు.

ఆసాయంత్రంనుంచీ ఇంటి కెదురుగుండా నిలుచున్న ఉప్పరవాళ్ల బ్బాయిమీదనుంచి ఆమెచూపులు మరలిపోనేలేదు. చీకట్లలో కలిసిపోతూ వెలుగుల్లో మెరిసిపోతూ కదలకుండా ఈకాలుమీద వంగి ఒకమాటూ, ఆకాలిమీద వంగి ఒకమాటూ నిలుచుని ఉన్న ఆపాపడు ఆమెహృదయాన్నీ, ఆలోచనలనూ ఇనుము నయస్కాంతం లాగేసినట్లు లాగేశాడు.

పంచితే ఒక్కొక్క పిల్లవాడికిగాని, పిల్లదానికిగాని వచ్చిన అయిదురూపాయీల బాణసంచా వున్న బుట్టనూ వాడిచేతి కిచ్చి, "నాయనా! కాల్చరా!" అందా మనుకొన్నది.

"ఓసి, పిచ్చిదానా!" అని అందరూ నవ్వరూ? ఏమి టీ పిచ్చిఆలోచన!

౪

ఉన్నట్టుండి కళ్లు తిరిగి ఆ కుర్రవాడు భగ్నమైన ఆశలు కింద కూలినట్లు పడిపోయాడు. ఆ జ్వాలామహోత్సవంలో అరుగు మీద ఉన్నవాళ్లెవరికీ ఆకుర్రవాడు పడిపోవడం గమనించవలసిన అవసరమే లేకపోయింది. అది పురుషోత్తమ్మ చూసింది, ఒక్కపరుగులో మెట్లన్నీ దిగింది. తృణావర్తుణ్ణి హతమార్చి, భూమిమీద వాలిపోయిన శ్రీకృష్ణుణ్ణి ఎత్తుకొన్న యశోదలాగ, పురుషోత్తమ్మ ఆబాలుణ్ణి ఎత్తుకున్నది. రెండంగల్లో ఇంట్లోకి తీసుకొనిపోయింది. సావిట్లో బల్లమీద పడుకోబెట్టి, యింట్లోకి పరుగెత్తుకువెళ్లి వెండిగిన్నెలో ఇంత మజ్జిగ పోసి, అందులో ఇంత వేడివేడన్నం మెత్తగా పిసికి మెతుకులు పిండి అవతల పారేసి ఆగిన్నె పట్టుకు చక్కా వచ్చింది.

ఆపిల్లవాడినోట్లో చుక్కచుక్కా ఆమె పోయడం మొదలెట్టింది. ఇదంతా చూస్తూ తెల్లబోయి వాళ్లవాళ్లేమీ మాట్లాడలేకపోయారు. అన్నసారం దిగినకొద్దీ ఆపాపడికి ప్రాణం తెప్పిరిలి నెమ్మదిగా మెళుకువ వచ్చింది.

ఒకముసలాయన:— ఈ వెధవను తీసుకువచ్చి బల్లమీద పడుకోబెట్టం దేమిటి ? పాడుపని!

ఒకావిడ :— వీ డెల్లా వచ్చాడు ఇక్కడికి ?

ఒకచిన్నపిల్ల :— మన యింటిముందర పడిపోతే అత్తయ్య తీసుకొచ్చింది.

“మడిగట్టుకొని ప్రతివెధవనీ ముట్టుకోడమేనా ? పనివాళ్లచేతి కిస్తే నోట్లో పొయ్యరూ ?”

“ఈ విడగారి కీ పెత్తన మేమిటి ?”

పురుషోత్తమ్మ ఈ మాటలన్నీ వింటమే లేదు. ఆ కుర్రవాడు కళ్లు విప్పేటప్పటికి ఆమె ప్రాణాలు కుదుటపడ్డాయి. చల్లనిగాలిలా సంతోషం ఆమెదేహమంతా ప్రసరించింది. “నాయనా! ఇదంతా తాగు” అని ఆగిన్నె వాడిచేతి కిచ్చింది.

“ఇంక వీణ్ని పంపించు. చేసింది చాలు.”

“నీపే రేమిట్రా వెధవా! ఎవరబ్బాయివి ?”

“మే ముప్పరాళ్లమండి. నాపేరు చిట్టిగాడు”.

భోంచేసి చెయ్యి కడుక్కొని వచ్చిన ఇంటియజమాని “వాడిచేతిలో రెండు కానులు పెట్టి పంపించివేయండి. ఎవరైనా ఇట్లాంటివి చూస్తే మన కపఖ్యాతికూడాను”.

౫

ఇదంతా జరిగి ఏడాదయింది. మళ్లీ దీపావళిపండుగ వచ్చింది. తాను చిట్టిగాడిని తనగదిలోకి తీసుకువెళ్లి వాడిచేతిలో రహస్యంగా రెండురూపాయలు పెట్టి నాలుగు మతాబు లిచ్చి పంపించిన ఆనాటిసంగతంతా ఆమెకు జ్ఞప్తికివచ్చింది. ఆమెకళ్లనీళ్లు చెమరించినవి. చీకటిపడినదగ్గరనుంచి దీపాలు వెలిగించుకొంటూ, వీథిఅరుగుమీద కూర్చుని వీథిలోకి ఇటూ అటూ పదేపదే చూస్తూన్నది. పురుషోత్తమ్మ మూడేళ్ల మేనగోడలు మొలకు కట్టినబిళ్ల ఇటూ అటూ ఆడుతూండగా తొనలలాంటివేళ్లు కదిలిపోతూండగా చేతు లాడించుకొంటూ పురుషోత్తమ్మదగ్గరకు పరుగెత్తుకువచ్చి “అత్తయ్యా! తపాకాయలంతే బయమేత్తుంది. అక్కావాళ్లూ కాల్తే

తప్పాలు నన్నెత్తుకోవూ?" అని పురుషోత్తమ్మ మెడచుట్టూ రెండుచేతులూ పెనవేసింది.

"మాతల్లి! అల్లాగేనమ్మా! ఎత్తుకుంటానులే" అని ఆవిడ ఆబిడ్డను ఒళ్లోకి తీసుకొని ఒళ్లంతా ముద్దులుపెట్టుకొంది.

అప్పుడే చీకటిప్రపంచమంతా రంగు రంగుల వెలుగులతో అలంకరించుకొంటోంది. మతాబాలు వెలుగుతున్నై; పటేలుమని టపాకాయలు పేలుతున్నై. అనంత పథాలలో ఉన్న నక్షత్రాల నన్నటినీ పోగుచేసి, మళ్లీ విశ్వంలోకి వదులుతున్నారా అన్నట్లు శేరుతూటాలు జాజ్వల్యమయిపోతున్నై. ఇంతట్లో చిట్టిగాడు పది దీపావళి పొట్లాలు పట్టుకువచ్చి నెమ్మదిగా ఆవిడదగ్గర పెట్టాడు.

బీదవాళ్లకు దీపావళిపొట్లాలే మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాకాయలు, తూటాలున్నూ. మగతాడిచెట్టుగులకలు పోగుచేసి, కాల్చి బొగ్గుచేసి, గుడ్డలో పోసి పొట్లంకింద చుట్టి, దాని కింత పేడ రాసి తాటికమ్మని నాలుగుబద్దలకింద చీరి మధ్యన ఆపొట్లం పెట్టి, నిప్పులు పోసి బాగా అది రాజినతరువాత దాన్నితిప్పడం ప్రారంభిస్తారు. చిటపటమని పేలుతూ రవ్వలు వర్షం కురుస్తవి. ఆరవ్వలప్రవాహంలో మునిగిపోయిన ఆపిల్లల ఆనందానికి అం తుండదు.

పురుషోత్తమ్మ పొట్లాలు చూసింది; చిట్టిగాణ్ణి చూసింది. చిట్టిగాడు నవ్వుతూ ఆమెకేసి చూశాడు.

పురుషోత్తమ్మగుండె దడదడలాడింది. పురుషోత్తమ్మ మేనగోడలు ఆచిన్నపిల్ల కిల కిల నవ్వి చప్పట్లుకొట్టింది. పురుషోత్తమ్మ గబగబ లోపలికి పరుగెత్తుకువెళ్లి మంచం కింద ఎవరికీ కనబడకుండా దాచిఉంచిన బాణసంచాబుట్ట ఇవతలికి తీసి, చీరకొంగుచాటున కనపడకుండా పట్టుకుచక్కావచ్చింది.

ఆమెకు పెదవులు కంపించాయి. ఆమె కళ్లు చెమరించాయి. ఆమెహృదయంలో ఏదో తీపి పుట్టి ఆమెవక్షాలను ఉప్పొంగ జేసింది.

"ఇది పుచ్చుకుని ఇంటికి వెళ్లి కాల్చుకో! పో!" అని ఆ పురుషోత్తమ్మ ఆబుట్ట చిట్టిగాడిచేతిలో పెట్టింది. చిట్టిగాడిమోము తళతళలాడిపోయింది. వాడి పెదవుల్లో కన్నుల్లో ఉషఃకాంతులవంటి నవ్వులు పరుగులిడినవి.

ఇంతట్లో ఎక్కడనుంచి వచ్చాడో కారుమేఘంలా చిట్టిగాడిదగ్గరికి ఆ యింటి యజమాని. వాడి చేతిలో బుట్ట లాక్కొని మొహం ఊడిపడేటట్టు చెళ్లున ఒకలెంపకాయి కొట్టినాడు.

"వెధవముండలికి పెత్తనాలు! ఎవ రిమ్మన్నారు ఈబాణసంచా? ఊళ్లోవాళ్ల కందరికీ బాణసంచాలు పంచిపెట్టేటట్టయితే ఇల్లూ వాకిళ్లూ కొంపలూ ఆస్తులూ ఆగుతాయా?" అని "పోరా, వెధవా! నిరు డొచ్చావు చాలదూ? మళ్లీ శనిలా దాపురించావా?" అని ఆయింటి యజమాని చిట్టిగాణ్ణి ఒక్క తాపు తన్నాడు.

"అమ్మయ్యో! చంపేశా" డని పురుషోత్తమ్మ మడయినా అని ఆలోచించకుండా అరుగుమీాదనుంచి ఉరికి వాణ్ణి చివ్వున ఎత్తుకొన్నది.

"ఛీ! పాడుముండా!" అంటూ ఇంటి యజమాని మెరుములా బుట్ట అరుగుమీద పెట్టడం, చిట్టిగాణ్ణి ఆమె చంకలోనుంచి లాగడం, ముట్టుకుంటేనే తన పవిత్రత అంతా తగలడిపోతుందేమో అన్నట్లు, వాణ్ణి చెయ్యి పట్టుకొని వీథిమధ్యకి విసరివేయడం అంతా త్రుటిలో జరిగిపోయింది.

## ౬

చిట్టిగాడికి లోకం తల్లక్రిందులైపోయింది. రోడ్డుమీద రాయి తలకు తగిలి, పగిలి రక్తం కారడం మొదలుపెట్టింది. పురుషోత్తమ్మ కెవ్వున అరుస్తూ అరుగుదగ్గరే కూలిపోయింది. ఈగలభకు ఇంట్లోవాళ్లు పిల్లలూ, పెద్దలూ అరుగుమీదకు చక్కా వచ్చారు. పొట్లాలివ్వడం తప్పో, బుట్ట తీసుకోవడం తప్పో ఉప్పరవాడై పుట్టడం తప్పో చిట్టిగాడి కేమి తెలుస్తుంది? వాడి మొఖం అంతా రక్తమయమైపోయింది. ఉగ్రుడైపోయిన ఇంటియజమాని ఇంకా రెండుతన్నులు తన్నడానికి పిడికిళ్లు ముడుచుకొని, కోరలు కనపరుస్తూ, కాట్లకుక్కలా కస్సుకస్సుమంటూ వాడిదగ్గరకి నడిచాడు. అరుగుమీద చంటిబిడ్డ ఒకటే గోల. వాడికొమ్ములు చూపిస్తూ, బుస కొట్టుతూ వచ్చే మహిషాసురుడిలా ఉన్న ఇంటి యజమానుణ్ణి చూచి సమ్మెటపెట్టులాగ తలమీది బాధ అయినా గమనించకుండా, చిట్టిగాడు లేచి భయంతో కనుపాపలు తిరిగిపోగా కెవ్వుకెవ్వున అరుస్తూ పరుగెత్తడం ప్రారంభించాడు. పురుషోత్తమ్మ లేచింది, మహాశక్తిలా ఉగ్రురాలయిపోయింది. ఈ రాక్షసుడు ఉండే కొంపలోనే నసలే ఉండనని పొలికేక పెట్టింది. శోకాన్ని దుఃఖం తరుముకొనివచ్చింది. 'చిట్టిగా! చిట్టిగా!' అంటూ వాడు వెళ్లినదారినే తూలుతూ ఆమె ఆ దీపావళి వెలుగుల్లో, చీకట్లల్లో. వీథులా సందులా పడి నడచిపోయింది.

'అత్తయ్య కావాలీ, అత్తయ్య కావాలీ' అని అరుగుమీద చంటిబిడ్డ మారాం పెట్టింది.

